

## వేసవిలో చివరి ఆయకట్టుకు సాగునీరు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి - నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ బుధవారం | 12 మార్చి 2025 | ■ 8 పేజీలు




6

## నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు


# అసెంబ్లీ

- మన ఎమ్మెల్యేలు గళమెత్తేనా..?!
- విమానాశ్రయం ఏర్పాటుపై చర్చ జరిగేనా
- సీసీఐ పునరుద్ధరణ ప్రస్తావనకు వచ్చేనా?
- నిర్మల్‌లో నిలిచిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు..
- కుమ్రంభీం జిల్లాలో పోడు, తాగు నీటి సమస్య..

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

ఇంకా కొన్ని గంటల్లో సభా పర్వం మొదలుకానుంది. ఈ సమావేశాల్లో అధికార కాంగ్రెస్ 14 నెలల పాలన వైఫల్యాలను ఎండగట్టేందుకు బీజేపీ సిద్ధమైంది. ఇటు బీఆర్ఎస్ సైతం హామీల అమలు విషయంలో వైఫల్యంపై ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయం తీసుకున్నారు. అధికార పార్టీ సైతం విపక్షాలకు గట్టి కౌంటర్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసుకున్నది. నేటి నుంచి ప్రారంభం కానున్న ఈ సమావేశాలు అత్యంత ఆసక్తి, ఉత్కంఠ రేపుతున్నాయి. ఇదిలా ఉండగా సుమారు 20 రోజులపాటు సమావేశాలు సాగనున్న నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పదిమంది శాసన సభ్యులు జిల్లాకు ఏ మేరకు మేలు చేస్తారో అన్న ఆశతో జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు.





8

## ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందిస్తాం

- ఆడపడుచులకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ వరంలాంటిది
- టైగర్ జోన్ వైల్డ్ లైఫ్ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తా
- గ్రామీణ ప్రాంతాల్లో తాగు, సాగు నీటి సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి..
- నిర్దిష్ట మార్గదర్శకత్వంలో నడిస్తేనే విజయాలు వరిస్తాయి
- విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని సాధించాలి
- ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రతి పేదోడికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపడుతుందని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేదింటి ఆడపడుచులకు కల్యాణ లక్ష్మీ పథకం ఆర్థికంగా ఎంతో మేలును చేకుర్చుతుందని అన్నారు. అదే విధంగా ఉట్నూర్ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్, విద్యార్థులకు వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు జనరల్ స్టడీస్, సాధారణ గణితం, ఇంగ్లీష్, రీజినింగ్ అనే అంశాలపై నిర్వహించిన 100 రోజుల శిక్షణలో పాల్గొని మాట్లాడారు. కవ్వాల్ టైగర్ జోన్ సమస్యను అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానన్నారు.



## సింగరేణి మరో ముందడుగు

- 40నెలల్లో థర్మల్ ప్లాంట్ ■ అది పూర్తయితే ఏటా రూ.300 కోట్ల లాభాలు..
- ఎన్టీపీపీలో 800 మెగావాట్ల ఉత్పత్తి ■ నిర్మాణానికి బీహెచ్ఈఎల్‌తో ఒప్పందం
- వచ్చే నెలలో పనులు ప్రారంభం ■ వివరాలు వెల్లడించిన సింగరేణి సీఎండీ బలరాం నాయక్

మంచిర్యాల జిల్లా జైపూర్ వద్దనున్న 1200 మెగావాట్ల సిం గరేణి థర్మల్ విద్యుత్ కేంద్ర ప్రాంగణంలో మరో 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ నిర్మాణా నికి ఇప్పటికే టెండర్లు పూర్తి కాగా.. సోమవారం సాయంత్రం ఈ నిర్మాణ పనులకు సంబంధించి ప్రభుత్వరంగ సంస్థ అయిన భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్‌తో సింగ రేణి సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది.

2

3లో

## ఆదిలాబాద్‌లో బిహార్ సైబర్ ముఠా అరెస్ట్

- చాకచక్యంగా పట్టుకొని భగ్నం చేసిన పోలీసులు
- ఆరుగురిపై కేసు నమోదు, ఐదుగురు అరెస్ట్, పరారీలో ఒకరు
- 2125 పాత ఫోన్‌లు, సిమ్ములు, బైక్‌లు, బ్యాటరీలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్





## బాలుడి ప్రాణం తీసిన కూల్ డ్రింక్ బాటిల్ మూత

- శోక సంద్రంలో తల్లిదండ్రులు
- నోట్లో పెట్టుకున్న బాలుడు..
- అందరిని కలిచివేసిన మృతి..
- లక్షెట్టిపేటలో విషాద ఛాయలు

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకుల సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క

కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను గ్రామ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

వివరాలు 8లో



# కంటి అద్దాలు అవసరమైన విద్యార్థులకు పంపిణీకి చర్యలు

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మార్చి 11 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులలో కంటి అద్దాలు అవసరమైన వారికి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ లో గల కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంలో 20 మంది విద్యార్థులకు జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా॥హరీష్ రాజ్, వైద్య అధికారులతో కలిసి కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 568 పాఠశాలలు ఉండగా ఇందులో 164 రెసిడెన్షియల్ పాఠశాలలలో 8 ఆర్.బి.ఎస్.కె. బృందాల ద్వారా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి 1 వేయి 274 మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లుగా గుర్తించడం జరిగిందని తెలిపారు. వీరందరికీ కంటి వైద్య నిపుణులు డా॥యశ్వంత్ రావు, డా॥చంద్రబాన్, డా॥శిల్ప శ్రీ, ఆప్తాల్మిక్ అధికారులు శంకర్, భాస్కరెడ్డిల ద్వారా ఫిబ్రవరి నెలలో ప్రభుత్వాసుపత్రిలో తిరిగి పరీక్షలు నిర్వహించి అద్దాల కోసం వివరాలు పంపించడం జరిగిందని తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని బృందాల ద్వారా గుర్తించి కంటి వైద్య నిపుణుల ద్వారా పరీక్షలు చేసి అద్దాలు పంపిణీ చేయడం జరిగిందని, కంటి అద్దాలను తప్పనిసరిగా వినియోగించాలని తెలిపారు. కంటి సమస్యలు రాకుండా ప్రతి ఒక్కరూ ఆహార అలవాట్లు మార్చుకోవాలని, ఏదైనా కంటి సమస్యలు ఉన్నట్లయితే ఆర్‌బిఎస్‌కె బృందాల ద్వారా గుర్తించి ప్రభుత్వపరంగా చికిత్సలు పొందాలని తెలిపారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, వాతావరణ మార్పులతో వచ్చే వ్యాధులు, వేసవికాలంలో వడదెబ్బ నుండి తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లాలోని 1 వేయి 241 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారి డా॥అనిత, జిల్లా అంధత్వ నివారణ అధికారి డా॥యశ్వంతరావు, వైద్యాధికారులు డా॥ప్రసాద్, డా॥ కృపాబాయి, డా॥అశోక్, డా॥శ్వేత, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రిన్సిపల్ స్వప్న, ఉపాధ్యాయులు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



### కళాశాలల అభివృద్ధికి
# ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది
### ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**దస్తురాబాద్, మార్చి 11 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలోని కళాశాలల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా ప్రత్యేక ప్రణాళికలను రూపొందించడం జరుగుతుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో 30 కళ్యాణ లక్ష్మీ, షాది ముభారక్ చెక్కులను పంపిణీ చేశారు. తదనంతరం కేజీబివి కళాశాలలో 2కోట్ల 30లక్షల వ్యయంతో నిర్మించనున్న భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. కళాశాలల అభివృద్ధికి కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని అన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. పేదరికాన్ని నిర్మూలించే ఏకైక ఆయుధం చదువు అని ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. పేదలకు మేలు చేకూరేలా ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. పేదింటి ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మీ పథకం ఆర్థికంగా ఎంతో చేయూతను అందిస్తోందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారి

**తాంసి, మార్చి 11 (ప్రభాత సమాచారం)**
తాంసి మండలంలోని యాసంగి పంటల పరిస్థితిని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) శ్రీధర్ స్వామి పరిశీలించారు. తాంసి (బి) గ్రామంలో పంటల పెరుగుదల, సాగునీటి లభ్యత, ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పంటల నష్టతీవ్రతను తగ్గించుకోవడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని రైతులకు డీఏవో శ్రీధర్ స్వామి సూచించారు. నీటి వాడకాన్ని సమర్థవంతంగా వినియోగించు కోవడం, ప్రత్యామ్నాయ సాగు విధానాలు అవలంభించుకోవాలని తెలిపారు. అనంతరం ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవీందర్, ఏఈవో నిఖిత, రైతులు గంగారెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.



# బాలుడి ప్రాణం తీసిన కూల్ డ్రింక్ బాటిల్ మూత

- శోక సంద్రంలో తల్లిదండ్రులు
- అందరిని కలిచివేసిన బాలుడి మృతి..



ఇంట్లో బుడిబుడి నడకలతో, ముద్దుముద్దు మాటలతో తమ కళ్లెదుటే తిరుగుతుంటే ఆ తల్లిదండ్రులు మురిసిపోయారు.. కానీ వారి ఆనందం ఎంతోకాలం నిలువలేదు. కూల్ డ్రింక్ బాటిల్ మూత రూపంలో వచ్చిన మాయావి ఆ బాలుడిని ఈలోకం నుంచి శాశ్వతంగా తీసుకుపోయింది. కుమారిడి మరణం తల్లిదండ్రులు కన్నీమున్నీరయ్యారు. ఈ ఘటన అందరినీ తీవ్రంగా కలచివేసింది.

**లక్షెట్టిపేట, మార్చి 11 (ప్రభాత సమాచారం)**
కూల్ డ్రింక్ బాటిల్ మూత ఓ బాలుడిని బలిగొంది. నోట్ల పెట్టుకొని ఆడుకుంటుండగా గొంతులో ఇరుక్కొని మృతి చెందాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో చోటు చేసుకుంది. ఎస్ఐ సతీశ్ కథనం ప్రకారం.. లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు కు చెందిన గడికొప్పుల సురేందర్ తన భార్య, కూతురు, కుమారుడు రుద్రాయన్ (9నెలలు)తో కలిసి ఆదివారం సాయంత్రం కొమ్ముగూడంలోని తన బంధువుల ఇంట్లో జరిగిన ఫంక్షన్‌కు వెళ్లారు. ఈ క్రమంలో అక్కడ రుద్రయాన్ కూల్ డ్రింక్స్ బాటిల్ మూత నోట్లో పెట్టుకుని ఆడుకుంటుండగా.. గొంతులోకి వెళ్లింది. ఊపిరాడక ఉక్కిరి బిక్కిరవుతున్న కుమారుడిని చూసిన తల్లిదండ్రులు నోట్‌లో నుంచి మూత తీసి వెంటనే స్థానిక ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి మంచిర్యాలకు తీసుకెళ్లగా.. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే బాబు మృతిచెందినట్లు తెలిపారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు.



### నియోజకవర్గాన్ని
# ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ప్రతీ గ్రామంలో మౌలిక వసతుల కల్పినకు కృషి
- రూ.7కోట్ల 68లక్షలతో చేపట్టే రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే రామారావు పటేల్

**కుభీర్, మార్చి 11 (ప్రభాత సమాచారం)**
ముధోల్ నియోజకవర్గంలో ఉన్న ప్రతీ ఒక్క గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచడమే తన లక్ష్యం మని ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. మంగళవారం కుభీర్ మండలంలోని డోడర్నా గ్రామం నుంచి మహారాష్ట్ర సరిహద్దు అయినా వాసి వరక 7కోట్ల 68లక్షలు ఎస్టీ ఎస్ డి ఎఫ్ నిధులతో రహదారి నిర్మాణానికి మండల బీజేపీ నాయకులతో కలసి ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డోడర్నా 3,4,5 తండాలను కలుపుకొని దాదాపుగా ఎనిమిది కిలో మీటర్లు వరకు రహదారి నిర్మించేందుకు నిధులు మంజూరు కావడం ఇక్కడి ప్రజలకు ఎంతో మేలు కలుగుతుంది దీంతో గ్రామాలకు రోడ్లు బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. గతంలో ఇక్కడి గిరిజన ప్రజలు రోడ్డు బాగుచేయాలనీ చెప్పడంతో. దింతో గ్రామస్తులు పలు సమస్యలు ఉన్నాయాని చెప్పడంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి గ్రామాలను దశల వారీగా అభివృద్ధి పరిచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. అదే విదంగా డోడర్నా చేరువు, రోడ్లు నీటి సమస్యలు రాకుండా ఉండేందుకు నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బోయిడి విఠల్,వద్నామ్ నగేష్,నాయకులు రాథోడ్ శంకర్, సౌంలీ రమేష్, పైడిపెల్లి గంగాధర్,బీజేపీ మండల అధ్యక్షులు ఏశాల దత్తాత్రితో పాటు బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులున్నారు.

# పేదల కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం



**ఖానాపూర్, మార్చి 11 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ రాష్ట్రంలోని నిరుపేద ప్రజల కలను నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ అన్నారు. నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంకు శంకుస్థాపన, దస్తురాబాద్ మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మీ చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఖానాపూర్ మండలంలోని అడవి సారంగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు కట్టి ఇవ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పేద ఆడబిడ్డలకు అండగా నిలవడం కోసమే కల్యాణ లక్ష్మి పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దోనికేని దయానంద్, పట్టణ అధ్యక్షుడు రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, జంగిలి శంకర్, కడర్ల గంగా నర్సయ్య, మజీద్, జన్నారపు శంకర్, గుగ్లవత్ రాజేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# బిహార్ సైబర్ ముఠా అరెస్ట్



జిల్లా వ్యాప్తంగా అమాయక ప్రజలను నమ్మించి సైబర్ నేరాలకు పాల్పడేందుకు భారీ కుట్ర పన్నిన ముఠా గుట్టును ఆదిలాబాద్ పోలీసులు భగ్నం చేశారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పనులు చేస్తూ పాత వస్తువులు కొంటామని ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్న ముఠాను ఆదిలాబాద్ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పోలీస్ హెడ్ క్వార్టర్ లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

- చాకచక్యంగా పట్టుకొని భగ్నం చేసిన పోలీసులు
- సైబర్ నేరగాళ్ల నయా ప్లాన్ బట్టబయలు..
- ఆరుగురిపై కేసు నమోదు, ఐదుగురు అరెస్ట్
- 2125 పాత ఫోన్‌లు, 107 సిమ్ములు, ఐదు బైక్‌లు, 600 బ్యాటరీలు స్వాధీనం
- పరారీలో బిహారీ గ్యాంగ్ లీడర్..
- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్
- పాత మొబైల్స్ ఇచ్చి.. ప్లాస్టిక్ వస్తువులు తీసుకెళ్లండి అంటూ ఆదిలాబాద్‌లో సైబర్ నేరాలకు పాల్పడేందుకు ముఠాయత్నం



**ఆదిలాబాద్, మార్చి 11 (ప్రభాత సమాచారం)**

సైబర్ నేరాలను చేయాలని పథకం వేసిన ఘరానా ముఠాను ఆదిలాబాద్ పోలీసులు పట్టుకున్నారు. ఇందులో బీహార్‌కు చెందిన ముఠాను అరెస్ట్ చేసి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పట్టణంలోని పోలిస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి కేసు సంబంధించిన వివరాలను వెల్లడిం చారు. బిహార్ రాష్ట్రానికి చెందిన ఆరుగురు నిందితులు ముఠాగా ఏర్పడి దేశ వ్యాప్తంగా సైబర్ నేరాలకు పాల్పడడానికి వేసుకున్న ప్లాన్ లో భాగంగా ఏ1 తబ్రక్ గ్యాంగ్ లీడర్ గా ఉంటూ మిగిలిన ఐదుగురు నిందితులను బీహార్ రాష్ట్రం నుండి ఐదు బైకులతో పాటు తెలంగాణ రాష్ట్రానికి పంపడని తెలిపారు. ద్విచక్ర వాహనాలలో తిరుగుతూ పాత మొబైల్ ఫోన్ తీసుకొని ప్లాస్టిక్ డబ్బాలను ఇస్తామంటూ ఊర్లలో పట్టణాలలో తిరుగుతూ పాత మొబైల్ ఫోన్ లను, సిమ్ కార్డులు బ్యాటరీలను సేకరించారని పేర్కొన్నారు. వాటిలో లభ్యమైన సిమ్ కార్డుల ద్వారా, ఫోన్ల ద్వారా వివిధ రాష్ట్రాలలోని ప్రజలకు బ్యాంక్ అధికారులు అంటూ ఫోన్లు చేసి వారిని సైబర్ నేరం బారిన పడేవిధంగా చేసి డబ్బులు సంపాదించే ఒక ముఠా కుట్రను భగ్నం చేశామన్నారు. వీరి వద్ద నుండి దాదాపు 2125 పాత మొబైల్ ఫోన్‌లను, 107 సిమ్ కార్డులను వీరు ప్లాస్టిక్ డబ్బాలను అమ్మడానికి ట్రేలో అమర్చి ఉన్న ఐదు ద్విచక్ర వాహనాలను, వీరు వినియోగించే ఐదు మొబైల్ ఫోన్లను, 600 మొబైల్ బ్యాటరీలను వీరి వద్ద నుండి స్వాధీనం చేసుకొని రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయబడిందని తెలిపారు. ముఖ్యంగా వీరు ఇదివరకే కర్ణాటక రాష్ట్రం నుంచి దాదాపు పది నుండి 12 వేల వరకు మొబైల్ ఫోన్లను సేకరించి వాటి ద్వారా వివిధ సైబర్ నేరాలకు పాల్పడడం జరిగిందని తెలిపారు. వీరి కుట్ర విధానం ప్రజల నుండి సేకరించిన మొబైల్ ఫోన్లను వాటి సిమ్ కార్డులను వాడి అమాయక ప్రజలను మోసం చేసి ఈ ముఠా సభ్యులు పోలీసులకు చిక్కకుండా వుండాలనే దురుద్దేశంతో పక్క ఒక గ్యాంగ్ గా ఏర్పడి ఈ కుట్రలను పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అదే విధంగా ఈ మొబైల్ ఫోన్లో సిమ్ కార్డులు అమాయక ప్రజల పేరుపై ఉండడంతో తమపై అనుమానం రాదని సులువుగా చట్టం నుంచి తప్పించుకోవాలని దురుద్దేశంతో ఇలాంటి నేరాలు చేస్తారని వెల్లడించారు. దేశవ్యాప్తంగా భారీ ఎత్తున సైబర్ నేరాలకు పాల్పడాలనే ఉద్దేశంతో అరెస్టు అయిన ఏ2, ఏ6 పెద్ద ఎత్తున సెల్ ఫోన్లు, సిమ్ కార్డులు సేకరించి బీహార్‌కు తీసుకెళ్లి ఏ-1 తబ్రక్‌కు అప్పగిస్తారని పేర్కొన్నారు. సేకరించిన ఈ సెల్ ఫోన్లు, సిమ్ కార్డుల ద్వారా ఏ-1 అతని అనుచరులు దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు బ్యాంకు అధికారులమని నమ్మించి లేదా ఉద్యోగాలు ఇప్పిస్తామని లాటరీ గెలిచారని ఫోన్ చేస్తూ వివిధ రకాలుగా నమ్మిస్తూ మోసం చేస్తూ ఓటిపి తెలుసుకుంటారని పేర్కొన్నారు. అమాయక ప్రజల బ్యాంక్ అకౌంట్ నుండి డబ్బులను మళ్లించుకుంటారని తెలిపారు. నేడు స్వాధీనం చేసుకున్న ఫోన్ల ద్వారా ఎంతో మంది అమాయక ప్రజలను మోసగించాలని కుట్రపన్నడం జరిగిందని సైబర్ నేరస్తుల ఈ కుట్రను చాకచక్యంగా కనుక్కొని వారిని అరెస్ట్ చేసిన సైబర్ క్రైం డీఎస్పి హసీబుల్ల, డీఎస్పి జీవన్.రెడ్డి, 2 టౌన్ సీఐ కరుణాకర్ రావ్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ప్రజలు కూడా ఫోన్ లు అమ్మేటప్పుడు, కొనేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఎస్పీ సూచించారు. అపరిచితులకు, గుర్తు తెలియని వ్యక్తులకు ఫోన్‌లు విక్రయిస్తే సైబర్ బారిన పడతారని పేర్కొన్నారు.

# నిర్దిష్ట మార్గదర్శకత్వంలో నడిస్తేనే విజయాలు వరిస్తాయి




**ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్**

**ఉట్నూర్, మార్చి 11 (ప్రభాత సమాచారం)**

జీవితంలో నిర్దిష్ట మార్గదర్శకత్వంలో నడుస్తూ గమ్యాన్ని చేరుకునేలా ప్రతి ఒక్క విద్యార్థి కృషి చేయాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్ మరియు విద్యార్థులకు వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు,జనరల్ స్టడీస్,సాధారణ గణితం, ఇంగ్లీషు, రీజనింగ్ అనే అంశాలపై నిర్వహించిన 100 రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడే తత్వాన్ని అలవర్చుకొని పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని సాధించేలా సాధన చేయాలన్నారు. ఎన్ని ఒడుదుడుకులు వచ్చిన చదువును మధ్యలో ఆపకుండా ముందుకు సాగాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో విజయాలు వరించాలంటే సరైన మార్గదర్శకత్వంలో నడవాలని పిలుపునిచ్చారు.వివిధ రంగాల్లో ఉద్యోగాలు సాధించాలంటే అన్ని సబ్జెక్టులలో ప్రావీణ్యత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల



ప్రిన్సిపాల్ టి.ప్రతాప్ సింగ్,వైస్ ప్రిన్సిపాల్ డా.సాయి ప్రసాద్, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డా.ఎం. నర్సింగ్ రావు, చంద్రశేఖర్, డా.రాణి, కరుణాకర్, శ్రీకాంత్, రాజశేఖర్, డాక్టర్ రవీందర్, రాజ్ కుమార్, డా.కిషన్, తిరుపతి, డా. శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

**ఆదిలాబాద్, మార్చి 11 (ప్రభాత సమాచారం)**

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జెడ్పి మీటింగ్ హాల్లో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఆయన ముఖ్య అథితిగా హాజరయ్యారు. ముందుగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ శాఖల్లో రాణిస్తున్న మహిళలను సత్కరించి ప్రశంస పత్రాలను అందించారు.







## అటవీశాఖ బీట్ అధికారికి సెక్షన్ అధికారిగా పదోన్నతి

**జన్నారం, మార్చి 11 (ప్రభాత సమాచారం)**




కవ్వాల్ టైగర్ జోన్ జన్నారం అటవీ డివిజన్‌లోని ఇంధన్ పల్లి రేంజ్‌లో అటవీశాఖ బీట్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఎండీ ముజీబుద్ధిన్ ను అట వీశాఖ సెక్షన్ అధికారిగా పదోన్నతి కల్పిస్తూ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన ముజీపుద్దిన్ ను మంచిర్యాల డివిజన్ మంచిర్యాల రేంజి పరిధిలోని పెగడపల్లి సెక్షన్కు కేటాయించారు. ఈ మేరకు పదోన్నతి పొందిన ముజీబుద్దిన్‌ను ఇంధన్‌పల్లి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్, అటవీశాఖ అధికారులు, సిబ్బంది అభినందించారు. మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని కోరారు.

## గ్రూప్ 2 ఫలితాల్లో బజార్‌హత్నూర్ మండలవాసుల ప్రతిభ

**స్టేట్ 15, 51వ ర్యాంకులు సొంతం**

**ఇచ్చోడ, మార్చి 11 (ప్రభాత సమాచారం)**

గ్రూప్-2 ఫలితాల్లో ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ వాసులు సత్తాచాటారు. ఒకరు స్టేట్ 15, మరొకరు 51వ ర్యాంకు సాధించారు. బజార్‌హత్నూర్ మండలంలోని కొల్హారి గ్రామానికి చెందిన బుద్దేవార్ నర్సింలు, రాధ దంపతుల కుమారుడు బుద్దేవార్ ముఖేష్ 418 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. బజార్ హత్నూర్ గ్రామానికి చెందిన బిట్లింగ్ లక్ష్మణ్, నీల దంపతుల కుమారుడు బిట్లింగ్ ఉదయ్ 404 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 51వ ర్యాంక్ సాదింధి తమ ప్రతిభ కనబర్చారు. ముఖేష్ చిన్నతనం నుంచే చదువులో చురుగ్గా ఉండేవాడు. పదో తరగతి వరకు సోనాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఇంటర్ ట్రిపుల్ ఐటీ బాసరలో, హైదరబాద్‌లోని ఖైరతాబాద్‌లో డిగ్రీ పూర్తి



చేశాడు. డిగ్రీ పూర్తి అయిన తర్వాత పంచాయితీ కార్యదర్శి, గ్రూప్-4 జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడింది. ఆ పరీక్షలకు హాజరై.. మూడు ఉద్యోగాలు సాధించాడు. 2019లో పంచాయితీ కార్యదర్శిగా ఎంపికయ్యాడు. 2021లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని పొందాడు. ప్రస్తుతం ఆసిఫాబాద్ ఇరిగేషన్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బిట్లింగ్ ఉదయ్ ఇప్పటికే పంచాయతీ కార్యదర్శి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, వీఆర్వో, గ్రూప్ 4 సింగరేణి (ఎస్‌సీసీఎల్) ఉద్యోగాలు పొందాడు. తాజాగా గ్రూప్-2 ఉద్యోగానికి ఎంపికయ్యాడు.



## ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను
# సత్వరమే పరిష్కరించాలి

**పంచాయతీ, మున్సిపల్ అధికారుల సమావేశంలో నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్, మార్చి 11 (ప్రభాత సమాచారం)**
ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఎల్ఆర్ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుల పరిష్కారంపై పంచాయతీ, మున్సిపల్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఈ నెల 31వ తేదీలోపు పూర్తి ఫీజు చెల్లిస్తేనే 25 శాతం రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 46వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే అధికారులకు దరఖాస్తుల పరిష్కారం పై అవగాహన, శిక్షణలు అందించడం జరిగిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎల్ ఆర్ ఎస్ ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, లోకల్ టీవీ ఛానల్ లలో ప్రచారం నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో టాం టాం నిర్వహించాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంపై రోజువారి రిపోర్టులను అందజేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం త్వరితగతిన జరిగి, ప్రజలకు లబ్ధి చేకూరేలా చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, రాజేష్ కుమార్, ఎంపీఓ లు, పంచాయతీ కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్య లేకుండా
# సహకరించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్**



**ఆదిలాబాద్, మార్చి 11 (ప్రభాత సమాచారం)**
పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వ్యాపారులు చిరు వ్యాపారులు పూర్తిగా సహకరించాలని వానదారులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య దృష్ట్యా చిరు వ్యాపారులతో మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సమస్యను నిర్మూలించడానికి సంబందిం చిన విషయాలను వారు చర్చించారు. చిరు వ్యాపారులు రోడ్లపై తోపుడు బండ్లను ఏర్పాటు చేసుకోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అందుకు వారు సరైన మార్గాలను ఎంచుకొని వ్యాపారాలను కొనసాగించాలన్నారు.

# క్రీడలు ఆరోగ్యానికి దోహదం చేస్తాయి

**■ మహిళలు క్రీడల్లో రాణించాలి**
**■ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభివనవ్**



**నిర్మల్, మార్చి 11 (ప్రభాత సమాచారం)**
క్రీడలు మహిళల ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం కొండాపూర్ సమీపంలోని నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన మహిళల ప్రత్యేక క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంచే గొప్ప సాధనంగా నిలుస్తాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. విజయం సాధించినవారు విజయాన్ని మరింత ప్రేరణగా తీసుకుని ముందుకు సాగాలని, అలాగే ఇతర క్రీడాకారులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు ఈ అనుభవాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాలలో ప్రగతి సాధిస్తున్నారన్నారు. మహిళల క్రీడా ప్రోత్సాహానికి జిల్లాలో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన మహిళలకు కలెక్టర్ బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ రత్న కళ్యాణి, జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, మహిళ ఉద్యోగులు, నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్స్ నందకుమార్, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

# అడెల్లి ఆలయం వద్ద బహిరంగ వేలం



**సారంగాపూర్, మార్చి 11 (ప్రభాత సమాచారం)**
మండలంలోని అడెల్లి పోచమ్మ అలయంవద్ద ఒడి బియ్యం, చీరెలు, కనుమలు ప్రోగు చేసుకొనుటకు ఈ నెల 18 మంగళవారం ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈ ఓ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లీజు హక్కు తేది 21/04/2025 నుండి 20/04/2026 వరకు ఒక సంవత్సరం పాటు ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు సకాలంలో వచ్చి వేలం పాటలో పాల్గొనాలని కోరారు.



## ఎల్ఆర్ఎస్ ప్రొసిడింగ్
# కాపీ అందజేసిన కలెక్టర్

**ఆదిలాబాద్, మార్చి 11 (ప్రభాత సమాచారం)**
మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా క్యాంప్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారునికి ప్రొసిడింగ్ కాపీ అందజేశారు. 25% రాయితీతో ప్రభుత్వం ఇచ్చినఈ సదవకాశాన్ని వినియోగించుకోవడం జరిగిందని, మిగితా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఈ నెల 31 తేదిలోగా రుసుము చెల్లించి ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# రేషన్ బియ్యం పట్టివేత

**బెజ్జూర్, మార్చి 11 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని గొల్లవాడలో సల్మాన్ ఆటోలో ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా మంగళవారం పట్టుకున్నట్లు అధికా రి రాజ్ కుమార్ తెలిపారు. 6ఏ కేసు నమోదు చేసిన ట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం అందించే ఉచిత బియ్యాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట బెజ్జూర్ గిర్ధవర్ సంతోష్ ఉన్నారు.

# సింగరేణి మరో ముందడుగు

**■ 40నెలల్లో థర్మల్ ప్లాంట్ ■ అది పూర్తయితే ఏటా రూ.300 కోట్ల లాభాలు..**
**■ ఎన్టీపీపీలో 800 మెగావాట్ల ఉత్పిత్తి ■ నిర్మాణానికి బీహెచ్ఈఎల్‌తో ఒప్పందం**
**■ వచ్చే నెలలో పనులు ప్రారంభం ■ వివరాలు వెల్లడించిన సింగరేణి సీఎండి బలరాం నాయక్ కీలక ప్రకటన**



**మంచిర్యాల, మార్చి 11 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా జైపూర్ వద్దనున్న 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్ర ప్రాంగణంలో మరో 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు పూర్తి కాగా.. సోమవారం సాయంత్రం ఈ నిర్మాణ పనులకు సంబంధించి ప్రభుత్వరంగ సంస్థ అయిన భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ తో సింగరేణి సంస్థ ఒప్పందం కుదుర్చు కుంది. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ తరపున సీఎండీ ఎన్.బలరామ్‌తో పాటు డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్ (ఆపరేషన్స్), ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్(పీ అండ్ పీ) కె.వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) ఎస్.డి.ఎం.సుభానీ, సింగరేణి విద్యుత్ విభాగం ఉన్నతాధికారులు, బీహెచ్ఈఎల్ నుంచి జనరల్ మేనేజర్ మరియు హెడ్ పార్థసారథి దాస్, జీఎం జోగేష్ గులాటి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ.. గరిష్టంగా నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయాలని ఒప్పందం ఉన్నప్పటికీ, 40 నెలల్లోనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా వచ్చే నెల నుంచే పనులు ప్రారంభించాలన్నారు. ఇచ్చిన షెడ్యూల్ లోపే పనులు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. పవర్ ప్రాజెక్టు ప్రాంగణంలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని వినియోగించుకుని త్వరితగతిన ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బీహెచ్ఈఎల్ జీఎం అండ్ హెడ్ పార్థసారథి దాస్ మాట్లాడుతూ.. సింగరేణి పవర్ ప్లాంట్‌ను అతి ప్రాధాన్య ప్రాజెక్టుగా తమ బోర్డు నిర్ణయించిందని, ఈ నేపథ్యంలో పనులను వెంటనే ప్రారంభిస్తామన్నారు. గతంలో చేపట్టిన 1200 మెగావాట్ల ప్రాజెక్టులో ఎదురైన సమస్యలను ముందే అధిగమించేలా ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు.

**ప్లాంట్ పూర్తయితే ఏటా రూ.300 కోట్ల లాభాలు..**
ఈ ఒప్పందం ప్రకారం సంస్థ 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి సంబంధించి బాయిలర్స్, టర్బైన్స్, జనరేటర్ల (బీటీజీ) ఏర్పాటుతోపాటు అన్ని రకాల సివిల్ తదితర అన్ని నిర్మాణాలను 48 నెలల్లో అనగా నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం సింగరేణి సంస్థ 2016లో పూర్తయిన 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం విజయవంతంగా నడుస్తూ కంపెనీకి ప్రతి ఏడాది సుమారు 450 కోట్ల రూపాయల వరకు లాభాలను ఆర్జించి పెడుతుంది. ఇప్పటివరకు ఈ ప్లాంటు సుమారు 70 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను రాష్ట్ర అవసరాలకు అందించింది. ఈ నేపథ్యంలో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం పలుమార్లు దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న థర్మల్ విద్యుత్ కేంద్రాలలో కెల్లా అత్యధికంగా ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీ.ఎల్.ఎఫ్.) సాధిస్తూ జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. ఇదే ప్రాంగణంలో సింగరేణి సంస్థ మరో యూనిట్ స్థాపించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్లాంట్ పూర్తయితే సింగరేణి సంస్థకు ఏడాదికి మరో 300 కోట్ల రూపాయల వరకు లాభాలు చేకూరే అవకాశం ఉంది.

# జనావాసాల నుంచి డంప్‌యార్డును తరలించండి



**శ్రీరాంపూర్, మార్చి 11 (ప్రభాత సమాచారం)** సీసీసీలోని జనావాసాల మధ్య ఉన్న డంప్‌యార్డును అక్కడి నుంచి తరలించాలని సింగరేణి ఉద్యోగులు ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణుకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ, సింగరేణి ఉద్యోగుల క్వా ర్టర్ల మధ్యలోని ముక్కిడి పోచమ్మ ఆలయం వెనుకవైపు డంప్‌యార్డు ఉండడంతో తీవ్ర దుర్గంధం వస్తోందని, తరచుగా చెత్తను తగులబెట్టడంతో పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని తెలిపారు. పది కిలోమీటర్ల పరిధిలో ఇళ్లల్లో నివాసం ఉండేవారికి శ్వాసకోస వ్యాధులు వస్తున్నాయని, అస్తమా ఉన్న వారు గాలి పీల్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్కే-5 కాలనీ, టీచర్స్ కాలనీ, సీసీసీ టౌన్‌షిప్, శ్రీరాంపూర్ కాలనీ, నస్పూర్ కాలనీ, బి-టౌప్ క్వార్టర్లు, బంగ్లాస్ ఏరియా, ఆర్కే-8 కాలనీ క్వార్టర్స్, ఇతర కార్మిక నివాసం ప్రాంతాలలో తీవ్ర ప్రభావం చూపుతున్నదని వివరించారు.



## హామీలు అమలు చేయకుంటే రాజీనామా చేయాలి

### మాజీ మంత్రి జోగు రామన్న

**ఆదిలాబాద్, మార్చి 11 (ప్రభాత సమాచారం)** హామీలు అమలు చేయకుంటే రాజీనామా చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. మంగళవారం ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు కేంద్ర రాష్ట్ర పనులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీ, ఎయిర్పోర్ట్ విషయంలో ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారన్నారు. ఎయిర్పోర్ట్ విషయంలో ఎంపీ వ్యాఖ్యలను ఖండించిన జోగు రామన్న ఎంపీ వ్యాఖ్యలు నిజమైతే తన స్వగ్రామమైన జాతరలోని శివాలయంలో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో నాయకులు నారాయణ, అజయ్, కుమ్ర రాజు, దమ్మ పాల్, సీను, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి



**నిర్మల్, మార్చి 11 (ప్రభాత సమాచారం)** ప్రతి ఒక్క మహిళ సంఘాల ద్వారా ఆర్థిక పురోగతి సాధించాలని డీఆర్డీవో విజయ లక్ష్మి అన్నారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల మహిళా సమైక్య భవనంలో తొమ్మిది మండలాలకు సంబంధించిన ఏపీఎం, సీసీల శిక్షణ తరగతులకు మంగళవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండి స్వీయ రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిపిఎం ప్రసాద్ ఆయా మండలాల ఏపిఎంలు, సిసిలు పాల్గొన్నారు.

## వాహనాలను తనిఖీ చేసిన ఎస్సై



**ముథోల్, మార్చి 11 (ప్రభాత సమాచారం)** మండలంలోని తరోడ-చించాల గ్రామంల మధ్య మంగళవారం సాయంత్రం ముథోల్ ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను ముమ్మరంగా తనఖీ చేశారు. వాహనదారులు సంబంధిత వాహన పత్రంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసే వదిలిపెట్టారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, సంబంధిత పత్రాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై శ్రావణి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కృషి విజ్ఞాన కేంద్రంలో రైతు నేస్తం



**బెల్లంపల్లి, మార్చి 11 (ప్రభాత సమాచారం)** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాటు చేసిన దృశ్య శ్రవణ పరికరాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డా.ఆల్దాస్ జానయ్య చేతుల మీదుగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించడం జరిగిందని కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. కోట శివకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల మరియు కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రైతులు వారు సాగు చేస్తున్న పంటలకు సంబంధించిన సమగ్ర పంటల యాజమాన్యం పైన మరియు వ్యవసాయ అనుబంధ రంగాల పైన శాస్త్రవేత్తలతో నేరుగా చర్చించే అవకాశం దొరుకుతుందన్నారు. ఇప్పటివరకు వ్యవసాయ శాఖ ద్వారా మాత్రమే 566 ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ఈ సేవలను శాస్త్రవేత్తలతో అనుసంధానం చేసేలా 8 కృషి విజ్ఞాన కేంద్రాలు మరియు 3 ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాలకు విస్తరించడం ద్వారా స్థానికంగా సాగు చేసే పంటల్లో తలెత్తే సమస్యలను నేరుగా శాస్త్రవేత్తలతో చర్చించే అవకాశం ఉందని తద్వారా సాగు విధానంలో మార్పులు వచ్చే అవకాశం ఉందన్నారు.

# ఎమ్మెల్సీ అంజి రెడ్డిని సన్మానించిన అరిగెల



**ఆసిఫాబాద్, మార్చి 11 (ప్రభాత సమాచారం)** పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందిన అంజిరెడ్డి బీజేపీ సీనియర్ నాయకుడు, వన్ నేషన్‌వన్ ఎలక్షన్ ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వరరావు సన్మానించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్సీ అంజిరెడ్డి దృష్టికి అరిగెల నాగేశ్వరరావు తీసుకెళ్లారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి దృష్టి పెడతామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం జూబ్లీహిల్స్ లోని హనుమాన్ ఆలయంలో 108 టెంకాయలు కొట్టి తమ మొక్కును తీర్చుకున్నారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

### ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ఆదిలాబాద్, మార్చి 11 (ప్రభాత సమాచారం)** ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ నియోజవర్గానికి 3,500 ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచిన ఒక్క ఇల్లుకు పునాది పడలేదని ఆయన అన్నారు. ఏ గ్రామంలో ఎవరికి మంజూరు చేశారనేది కూడా తెలియదనీ, ఆరు గ్యారంటీల అమలుపై శాసనసభలో ఎండగడతామన్నారు. రాష్ట్ర సమస్యలపై ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్లి నరేంద్ర మోడీని కలిస్తే రాష్ట్ర వాటా చెల్లించకపోవడం వల్ల అమలు కానీ కేంద్ర పథకాలపై సమీక్షించుకోవాలని సూచించారు. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులను సైతం ఇవ్వకపోవడంతో అనేక పథకాలు అసంపూర్తిగా మిగిలిపోయాయన్నారు. వచ్చే బడ్జెట్‌లో పథకాల వారిగా నిధులు కేటాయించి అమలు అయ్యేలా చూడాలన్నారు.

## వెడ్మ ఫౌండేషన్‌కు రూ.50వేల విరాళం



**ఉట్నూర్, మార్చి 11 (ప్రభాత సమాచారం)** నిరుపేదలకు,నిస్సాయులకు,విద్యార్థులకు,రైతులకు వెడ్మ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను గుర్తించి యూత్ కాంగ్రెస్ నాయకులు సల్లు భాయ్ తనవంతుగా రూ.50వేలు విరాళాన్ని వెడ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు - ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ కు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెడ్మ ఫౌండేషన్ నిత్యం ప్రజా సేవలో ఉంటుందన్నారు. దార్శనిక విద్య,బహుళ వ్యవసాయం, సామాజిక సేవ అనే లక్ష్యాల సాధన వైపు పని చేస్తోందన్నారు. స్వచ్ఛందంగా దాతలు ముందుకు వచ్చి 50 వేల విరాళంను తమ ఫౌండేషన్ కు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ విరాళం అందించిన సల్లు భాయ్ కు కృతజ్ఞతలు తెలిపారు. వారు అందించిన ఆర్థిక సహాయం పేదలకు ఆర్థికంగా ఎంతో తోడ్పాటును అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ మండల సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ మోబిన్ తదితరులున్నారు.

## విద్యుత్ తీగల తొలగింపు



**నిర్మల్, మార్చి 11 (ప్రభాత సమాచారం)** నిర్మల్ పట్టణంలోని అస్రా కాలనీలో ఓ ఇంటి పై కప్పు పై ప్రమాదకరంగా వాలి ఉన్న తీగలను అధికారులు సరి చేశారు. మంగళవారం పట్టణ విద్యుత్ శాఖ ఏఈ -2 సంజీవ్ కుమార్, లైన్ మెన్ గంగాధర్, తాజా మాజీ కౌన్సిలర్ మొహమ్మద్ అన్వర్ పాషా ల పర్యవేక్షణలో సిబ్బంది ప్రమాదకర తీగలను తొలగించి సరి చేశారు.

## న్యాయం చేయాలని ఫిర్యాదు

**లోకేశ్వరం, మార్చి 11 (ప్రభాత సమాచారం)** ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేశారు. ఇల్లు ఇప్పివ్వకపోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే బెదిరిస్తూ తప్పుడు కేసులు నమోదు చేయిస్తు న్నారని ఆరోపిస్తూ బాధితులు మంగళవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. లక్ష్మీనగర్ తండాకు చెందిన 17 కుటుంబాల వద్ద ఇరువురు నాయకులు ఇం దిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని ఒక్కొక్కరి నుంచి10,5000లు వసూలు చేసి ఇల్లు ఇప్పివ్వక పోవడంతో డ బ్బులు తిరిగి ఇవ్వాలని కోరితే తప్పుడు కేసులు పెడుతూ వేధిస్తున్నారన్నారు.



### తాగడానికి నీళ్లు ఇవ్వలేదని
## గొడ్డలితో మహిళపై దాడి

**మందమర్రి, మార్చి 11 (ప్రభాత సమాచారం)**

మందమర్రిలోని అంగడి బజార్ ఏరియాలో మద్యం మత్తులో తాగడానికి నీళ్ళు ఇవ్వలేదనే సాకుతో కందుల కుమార్ అనే వ్యక్తి పొగిడి రాంబాయి అనే మహిళపై గొడ్డలితో దాడి చేసిన సంఘటన పట్టణంలో కలకలం రేపింది. పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి రాంబాయిని మంచిర్యాల ప్రభుత్వాఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం వరంగల్ తరలించారు. రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుని కోసం గాలిస్తుండగా మంగళవారం జాతీయ రహదారి టోల్ గేట్ వద్ద పారిపోవడానికి సిద్ధంగా ఉన్న కుమార్‌ని అదుపులోకి తీసుకుని రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు.

## వాగులో శిశువు మృతదేహం

**ఇచ్చోడ, మార్చి 11 (ప్రభాత సమాచారం)**

గుడిహత్నూర్ మండలం గురుజా గ్రామంలో అమానుష సంఘటన చోటుచేసుకుంది. తొమ్మిది నెలలు నిండని మృతి చెందిన పసికందును గురజా గ్రామంలోని వాగులో గుర్తు తెలియని వ్యక్తులు పడేశారు. అది గమనించిన గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఇచ్చోడ సిఐ భీమేష్ గుడిహత్నూర్ ఎస్సై మహేందర్ సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపడుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఉపాధి హామీ పనుల పరిశీలన



**ఇచ్చోడ, మార్చి 11 (ప్రభాత సమాచారం)**

మండలంలోని నక్కల్ వాడ, కరత్‌వాడ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో రమేష్ మంగళవారం పరిశీలించారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా కూలీలు చేసిన పనులకు సంబంధించిన కొలతలను పరిశీలించారు. ఎంపీడీవో రమేష్ మాట్లాడుతూ.. ఎండాకాలం కావున ఉపాధి హామీ కూలీలు ఉదయం తొందరగా రావాలని, ఎండలు ముదురుతున్న కొద్ది పనుల వద్ద జాగ్రత్తలు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో నీటి సౌకర్యం కూడా కల్పించాలని అధికారులకు ఆదేశించారు. టిఏలు చంద్రశేఖర్, మధుకర్, ఎస్ఏ రాము పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్‌పై 25 శాతం రాయితీ

**ముథోల్, మార్చి 11 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎల్ఆర్ఎస్ పై 25 శాతం రాయితీని కల్పిస్తుందని ముథోల్ ఎంపీడీవో శివకుమార్ అన్నారు. మంగళవారం ముథోల్లోని మండల పరిషత్తు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020 సంవత్సరంలో ఎల్ఆర్ఎస్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఈనెల 31తేదీల్లోగా క్రమబద్ధీకరణ చేసుకు న్నట్లయితే 25 శాతం రాయితీ కల్పించడం జరుగుతుందన్నారు.

## 17న వారసంతలకు వేలంపాట

**జన్నారం, మార్చి 11 (ప్రభాత సమాచారం)**

17 జన్నారం మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారసంత, ప్రతిరోజు నిర్వహించే దిన సంతల కోసం వేలంపాట నిర్వహించడం జరుగుతుందని పొన్కల్ ఈవో రాహుల్ మంగళవారం తెలిపారు.

# చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, మార్చి 11 (ప్రభాత సమాచారం)**



వేసవిలో రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం కడెం మండలం కొత్తమద్దిపడగ గ్రామ శివారు పంట పొలాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి వివరాలను రైతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతులు సాగు చేసిన పంటలకు కడెం ప్రాజెక్టు సదర్మాట్ కాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకు అవసరమైన మేరకు నీటిని అందిస్తామని తెలిపారు. సాగునీటి విషయంలో రైతులు ఎవరూ ఆందోళన చెందనవసరం లేదన్నారు. ప్రతి పంట పొలానికి ఏప్రిల్ చివరి వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, నీటిపారుదల శాఖ ఈఈ విట్టల్, తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీఓ అరుణ, అధికారులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
## వెడ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేల సహాయం



**ఇంద్రవెల్లి, మార్చి 11 (ప్రభాత సమాచారం)**

మండలంలోని ఓల్ మద్రి గ్రామ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జల్పేట్ మారుతి గారి కుమారుడు జల్పేట్ వినోద్ అక్కడికక్కడే మృతి చెందారు.విషయం తెలుసుకున్న వెడ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ గారు మృతుడి తండ్రి జల్పేట్ మారుతికి 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి,మానవత్వాన్ని చాటుకున్నారు.మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖాడే ఉత్తం,వెడ్మ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాన్ సంస్థ సేవలు అభినందనీయం : ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా



**ఉట్నూర్, మార్చి 11 (ప్రభాత సమాచారం)**

మారుమూల గిరిజన ప్రాంతాల్లో నిర్మాన్ సంస్థ అంది స్తున్న సేవలు అభినందనీయమని ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని పీఎమ్మార్సీ భవనంలో గిరిజన విద్యార్థులకు క్రీడా పరికరాలు, దుస్తుల పంపిణీ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గిరిజన గ్రామాలను దత్తత తీసుకొని మౌలిక సదుపాయాలు కల్పిం చడం, విద్య, వైద్యం వంటి సదుపాయాలు కల్పించి గిరిజన అభ్యున్నతికి ఈ సంస్థ కృషి చేస్తుందని అన్నారు. క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు లక్ష వరకు క్రీడ పరికరాలు అందించారు. అంతకుముందు ఉమ్మడి అదిలా బాద్ జిల్లాలోని అదిలాబాద్ రాష్ట్ర స్థాయి వర్డ్ పవర్ ఛాంపియన్షిప్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను పీఓ అభినందించారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**బెల్లంపల్లి, మార్చి 11 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలును 200 కోట్ల రూపాయలతో మంజూరు చేయడంతో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే వినోద్ చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ స్వామి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరి బాబు, శ్రీనివాస్, రాజలింగు పాల్గొన్నారు.

## 'వారిపై చర్యలు తీసుకోవాలి'

**జన్నారం, మార్చి 11 (ప్రభాత సమాచారం)**

మండలంలోని ఇందన్ పెల్లి, చింతల పల్లె గ్రామాల్లో తాటి, ఈత చెట్లను రంపం ద్వారా కట్ చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జన్నారం మండల గౌడ సంఘం అధ్యక్షులు మూల భాస్కర్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇందన్‌పెల్లిలో గీతా కార్మికులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాటి, ఈత చెట్లను తొలగించి 04 రోజులు గడుస్తున్నా అబ్కారి అధికారులు పట్టించుకోక పోవడం శోచనీయని అన్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు అబ్కారి శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావుకు పిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇందన్ పల్లి గ్రామ గౌడ కులస్తులు పాల్గొన్నారు.

### నేటి నుంచి అసెంబ్లీ
# సమావేశాలు

**అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్న అధికార, విపక్షాలు**

**మన ఎమ్మెల్యేలు గళమెత్తేనా..?!**

**ఉమ్మడి జిల్లా అభివృద్ధికి నిధులు రాబడతారా?**

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

ఇంకొన్ని గంటల్లో సభా పర్వం మొదలుకానుంది. ఈ సమావేశాల్లో అధికార కాంగ్రెస్ 14 నెలల పాలన వైఫల్యాలను ఎండగట్టేందుకు బీజేపీ సిద్ధమైంది. ప్రధానంగా గడిచిన పదేండ్లలో రాష్ట్రానికి కేంద్రం నుంచి విడుదలైన నిధులు.. ఆరు గ్యారంటీల అమలు, 317 జీవోతో ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులు, ఫీజు రీయింబర్స్ మెంట్, పునరావాసం తర్వాతే మూసీ పునరుజ్జీవం వంటి కీలక అంశాలతో పాటు కాళేశ్వరం విషయంలో చేపట్టిన అఖిలపక్ష పర్యటన మాదిరిగానే 14 నెలల కాంగ్రెస్ పాలన పైనా మరో పర్యటన నిర్వహించాలనే డిమాండ్లతో అధికార పార్టీని నిలదీయాలని నిర్ణయం తీసుకున్నది. నేడు గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత.. అందులోని అంశాలను బట్టి బీజేఎల్పీ భేటీ నిర్వహించాలని ఆ పార్టీ నిర్ణయం తీసుకున్న ది. ఇందులో ఈ సమావేశాలు పూర్తయ్యే వరకు ఉభయ సభల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. ఇటు బీఆర్ ఎస్ సైతం ఈ సారీ ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధం మైంది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ నేరుగా రంగంలో దిగారు. నేడు ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో పాల్గొంటున్నట్లు ప్రకటించారు. ఇందులో ఎన్నికల ముందు ప్రకటించిన గ్యారంటీలు, హామీల అమలు విషయంలో వైఫల్యంపై ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయం తీసుకున్నారు. అధికార పార్టీ సైతం విపక్షాలకు గట్టి కౌంటర్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసుకున్నది. అధికార కాంగ్రెస్ కేంద్రం నుంచి రావల్సిన నిధులు, కీలక బిల్లుల ఆమోదంతో పాటు ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్లపై చర్చించి ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేలా ప్లాన్ చేసింది. దాంతో నేటి నుంచి ప్రారంభం కానున్న ఈ సమావేశాలు అత్యంత ఆసక్తి, ఉత్కంఠ రేపుతున్నాయి. ఇదిలా ఉండగా సుమారు 20 రోజులపాటు సమావేశాలు సాగనున్న నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పదిమంది శాసన సభ్యులు జిల్లాకు ఏ మేరకు మేలు చేస్తారో అన్న ఆశతో జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు అనేకం ఉండగా… తాజాగా ఎదురవుతున్న సమస్యలతో జిల్లా వాసులు సతమతం అవుతున్నారు. ఆ సమస్యలకు పరిష్కారమార్గం చూపడంతో పాటు కొత్త అభివృద్ధి పనులకు అసెంబ్లీలో మాట్లాడి ఎమ్మెల్యేలు నిధులు రాబట్టాలని జిల్లా వాసులు ఆకాంక్షిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సమస్యలు అనేకం.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శాసన సభ్యులు అసెంబ్లీలో ప్రస్తావించాల్సిన అనేక సమస్యలు ఉన్నాయి. వాటికి పరిష్కార మార్గం చూపే దిశగా ఎమ్మెల్యేలు చాకచక్యంగా, సమయానుకూలంగా వ్యవహరించి నిధులు సాధించాలన్న ఆకాంక్ష జిల్లా ప్రజల్లో ఉంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి అసెంబ్లీలో తీర్మానం చేయించే బాధ్యతను అక్కడి శాసనసభ్యుడు సహా జిల్లా ఎమ్మెల్యేలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే సీపీఐ పునరుద్ధరణకు సంబంధించి కూడా అసెంబ్లీలో మరోసారి ప్రస్తావించాల్సిన అవస రాన్ని జిల్లా ప్రజలు గుర్తు చేస్తున్నారు. మత్తడి వాగు కింద కాలువల నిర్మాణం పూర్తిస్థాయిలో ల్సిన అవసరం ఉంది. బోథ్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు అవసరంపై చర్చ, కుంటాల జలపాతం పర్యాటక కేంద్రం కోసం నిధులు మంజూరు కోరాల్సిన అవసరం ఉంది. నిర్మల్ జిల్లా కేంద్రంలో 100 కోట్లతో పెండింగ్ లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం నిధులు సమకూర్చాల్సిన అవస రంపై బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి సభలో గలం వినిపించాలని కోరుతున్నారు. నిర్మల్ ముథోల్ నియోజకవర్గంలో కొన్ని ఏళ్లుగా ఎదురుచూస్తు న్నసాగునీటి ప్రాజెక్టుల పునరావాసం నిధులపై సాగుతున్న అలసత్వంపై గుర్తు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే బాసర ట్రిపుల్ ఐటిసమస్యల పూర్తిస్థాయి పరిష్కారానికి చొరవ చూపాల్సి ఉంది. ఖానాపూర్ నియోజకవర్గంలో కడెం ప్రాజెక్టు ఎత్తు పెంచడంతోపాటు పూర్తిస్థాయి మరమ్మతు పనులు సహా కాలువల లైనింగ్ ఆయకట్టు స్థిరీకరణ పెంపుపై అక్కడి శాసన సభ్యుడు వెడ్మ బొజ్జు సభ దృష్టికి తీసుకు వస్తారని ఆశిస్తున్నారు. సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గంలో దీర్ఘకాలంగా అక్కడి ఆదిమ గిరిజనులు ఎదుర్కొంటున్న పోడు వ్యవసాయంకు సంబంధించిన వివాదంపై ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు పరిష్కారం చూపే దిశగా ప్రయత్నించాలని నియోజకవర్గం ప్రజలు కోరుతున్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో సంక్షేమ హాస్టళ్లను మెరుగుపరచడంతో పాటు ఆ నియోజకవర్గం నుంచి ఉట్నూర్‌లో ఉన్న ప్రధాన రహదారికి పూర్తిస్థాయి మరమ్మతుల కోసం నిధులు రాబట్టాల్సిన విషయాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి గుర్తు చేసేలా మాట్లాడాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో కొంతకాలంగా సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వివిధ గనుల్లో ఉన్న వివాదాల పరిష్కారం కోసం ఎమ్మెల్యే వినోద్ మాట్లాడాలని కార్మికులు కోరుతున్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి ప్రతి ఏటా పెరుగుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం చూపడం లేదు గోదావరి నుంచి తాగునీటి సరఫ రాకు సంబంధించి ఎమ్మెల్యే ప్రేమ సాగర్ రావు నిధులు రాబట్టాలని ఆ జిల్లా కేంద్ర వాసులు కోరుతున్నారు.

# ఆ సీన్ ఎప్పటీ మరిచిపోలేను




## యాడ్స్‌తోనే సంపాదిస్తున్నా: ప్రియావారియర్

నటనపై ఆసక్తితో సినీరంగంలోకి అడుగుపెట్టింది. షార్ట్ ఫిల్మ్స్ ద్వారా ఫేమస్ అయ్యింది.తర్వాత సినీరంగంలోకి నటిగా ఎంట్రీ ఇచ్చింది. కథానాయికగా ఆమె నటించిన ఫస్ట్ మూవీ సంచలన విజయం సాధించింది. ముఖ్యంగా అందులో ఆమె కనిపించిన సీన్స్ సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో దూసుకుపోయాయి. కట్ చేస్తే.. స్టార్ హీరోయిన్‌గా క్రేజ్ సొంతం చేసుకుంది. కానీ అందం, అభినయం కట్టిపడేసిన ఈ బ్యూటీకి అదృష్టం మాత్రం కలిసిరావడం లేదు. ఆమె నటించిన చిత్రాలు డిజాస్టర్స్ కావడంతో నెమ్మదిగా అవకాశాలు తగ్గిపోయాయి. కానీ సోషల్ మీడియాలో గ్లామర్ ఫోజులతో మెంటలెక్కిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆ బ్యూటీ మాట్లాడుతూ.. తనకు ఎవరూ అవకాశాలు ఇవ్వడం లేదని.. కానీ తాను మాత్రం సోషల్ మీడియా పేజీల ద్వారా ఆదాయం సంపాదిస్తున్నానని తెలిపింది హీరోయిన్ ప్రియా ప్రకాష్ వారియర్. ఒకే ఒక్క సినిమాతో మలయాళీ ప్రేక్షకుల హృదయాలను దోచుకున్న నటి ప్రియా ప్రకాష్ వారియర్. ఒమర్ లులు దర్శకత్వం వహించిన ఒరు అదార్ లవ్ చిత్రంలోని ఒక పాటలో కన్నుగీటుతూ కనిపించి ఒక్కసారిగా ఫేమస్ అయ్యింది. ఆ తర్వాత నెట్టింట తెగ ట్రెండ్ అయ్యింది. అలాగే మలయాళంలో వరుస ఆఫర్స్ అందుకుంది. ఒక్క రోజులోనే లక్షలాది మంది ఆ నటిని ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలో అయ్యారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రకటనలు, ప్రమోషన్ ద్వారా దృష్టిని ఆకర్షించింది. దీనివల్ల స్టార్‌కు మంచి ఆదాయం వచ్చింది. ఈ విషయాన్ని ఆ స్టార్ స్వయంగా బహిరంగంగా చెప్పడంతో ఇప్పుడు అది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా లేకపోయినా బ్రాండ్ల నుండి ప్రకటనలు వస్తున్నందుకు ఉపశమనం కలిగిస్తోందని తెలిపింది. కానీ తన లక్ష్యం మాత్రం సినిమాల్లో నటించడమే అని తెలిపింది.



# ప్రేమ వ్యాపారంగా మారితే.. విడిపోవడమే బెటర్ : తమన్నా

పెళ్లి కాకముందే బెస్ట్ కపుల్స్ అనిపించుకున్నారు తమన్నా, విజయ్‌వర్మ. అయితే.. ఇప్పుడు హటాత్తుగా ఇద్దరూ విడిపోయారనే వార్తలు మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అయితే.. ఈ విషయాన్ని వారు మాత్రం ధృవీకరించలేదు. అయితే.. ఇటీవలే ఓ కార్యక్రమంలో మీడియాతో మాట్లాడుతూ తమన్నా మాట్లాడిన మాటలు.. వారి బ్రేకప్‌కు బలాన్నిస్తున్నాయి. ప్రేమలో స్వేచ్ఛ ఉండాలి. కట్టడి ఉండకూడదు. ప్రేమలో ఎమోషన్స్ ఉండాలి. అంచనాలు ఉండకూడదు. అలా వుంటే అది ప్రేమకాదు. వ్యాపారం అవుతుంది. ఎప్పుడైతే ప్రేమ వ్యాపారంలా మారుతుందో.. అప్పుడు కలిసి ఉండటం కంటే విడిపోవడం బెటర్.' అంటూ స్పందించింది తమన్నా. ఆమె మాటలు విన్న వారంతా బ్రేకప్ విషయంపై ఓ అభిప్రాయానికి వచ్చేస్తున్నారు.



# ఆ రాత్రి నిద్ర లేదు

బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అక్కర్లేదు. ధడక్ అనే హిందీ సినిమాతో సినీ రంగంలోకి ఎంట్రీ ఇచ్చి.. మంచి పేరు సంపాదించుకుంది. ఈమె దివంగత స్టార్ సీనియర్ నటి శ్రీదేవి కుమార్తె అన్న విషయం తెలిసిందే. తర్వాత ఘోస్ట్ స్టోరీస్, గుంజన్ సక్సేనా ది కార్గిల్ గర్ల్.. అంగ్రేజీ మీడియం, రూహి, గుడ్ లక్ జెర్రీ, మిలి, బవాల్, రాకీ ఔర్ రాణి కియా ప్రేమ్ కహానీ, తేరీ బాతోన్ మే ఐసా ఉల్ఝా జియా, మిస్టర్ అండ్ మిసెస్ మహి, ఉలాజ్ వంటి సినిమాల్లో నటించి ఈ హీరోయిన్ ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకుంది. పింక్‌విల్లా స్టైల్ ఐకాన్స్ అవార్డులు, జీ సినీ అవార్డులు, లోక్‌మత్ స్టైలిష్ అవార్డులు, బాలీవుడ్ హంగామా స్టైల్ చిహ్నాలు, పింక్‌విల్లా స్క్రీన్ అండ్ స్టైల్ ఐకాన్స్ అవార్డులు వంటివి సొంతం చేసుకుంది. ఇక కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన దేవర చిత్రంతో జాన్వీ కపూర్ టాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. మొదట్లో విమర్శలు ఎదుర్కొన్న తర్వాత మంచి టాక్ సొంతం చేసుకుంది. 'చుట్టమల్లె చుట్టేశావే' సాంగ్‌తో తెలుగు ప్రేక్షకుల్ని విపరీతంగా ఆకట్టుకుందని చెప్పుకోవచ్చు. అయితే హార్దిక్ మెహతా దర్శకత్వం వహించిన రూహి చిత్రం నేటితో 4 సంవత్సరాలు పూర్తి చేసకుంది. ఈ సందర్భంగా జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. 'రూహి మూవీ వచ్చి 4 సంవత్సరాలు అవుతుంది. నేను ఫస్ట్ టైమ్ సోలో డ్యాన్స్ చేశాను. నేను చాలా చిన్నదాన్ని కూడా. ఈ పాట గురించి చాలా భయపడ్డాను. కఠినమైన లైట్ల కింద కళ్లు తెరిచి ఉంచడం కూడా నేర్చుకోలేదు. గుడ్‌లక్ జెర్రీ షూటింగ్ మధ్య 3 రోజులు రిహార్సల్ చేశాను. రాత్రంతా పాటియాలాలో జీఎల్‌జే కోసం షూటింగ్ చేశాను. ఉదయం ప్యాక్ అప్ తర్వాత విమానంలో ప్రయాణించాను. ఆ రాత్రి 7 గంటలు నిద్ర లేకుండా పాటను పూర్తి చేసాను. 3 రోజుల నిద్ర లేకున్నా మారథాన్, నేను కెమెరా ముందు ఉత్సాహంగానే ఉన్నాం. ఈ దుస్తులను మెరిసే కవచంలో నా రాత్రికి చివరి నిమిషంలో తీరని కాల్ తర్వాత ఒక రోజులో తయారు చేయడం సరదాగా అనిపించింది. హెయిర్ మేకప్ డ్యాన్స్ వార్డ్‌రోబ్ ప్రతిదీ ఇన్స్పో ప్రతీది ఐకానిక్" అంటూ జాన్వీ కపూర్ రాసుకొచ్చింది.

# రామ్‌చరణ్‌తో గిన్నెలు తోమించిన సుకుమార్



తండ్రికైన కొడుకుపైన మమకారం ఎక్కువే ఉంటుంది. కొడుకుకి ఏమైందని తెలిస్తే తండ్రి అల్లాడిపోతాడు. రామ్ చరణ్ విషయంలో చిరంజీవి కూడా ఓ సారి చాలా బాధని దిగమింగుకున్నాడట. మగధీర సినిమా సమయంలో చరణ్ కొన్ని ప్రమాదకరమైన స్టంట్స్ చేస్తుంటే చిరంజీవి చూడా ఎంతగానో భయపడ్డారంట. అప్పుడే తన తండ్రి కూడా చిరంజీవి చేసే స్టంట్స్ చూసి ఎంత బాధపడ్డారోనని రీసెంట్ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. ఇదే కాక మెగా వారసుడిగా ఇండస్ట్రీకి వచ్చిన రామ్ చరణ్ ఆర్ఆర్ఆర్ సినిమాతో గ్లోబల్ స్టార్‌గా ఎదిగాడు. ఆయనతో దర్శకుడు సుకుమార్ గిన్నెలు తోమించాడట. రామ్ చరణ్–సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కిన క్రేజీ ప్రాజెక్ట్ రంగస్థలం. ఈ సినిమా ఎంత పెద్ద హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఫేస్‌లోనే విభిన్న భావోద్వేగాలను పలికించి వావ్ ా అనిపించాడు. అప్పట్లో నాన్ బాహుబలి రికార్డులు బ్రేక్ చేసన ఈ చిత్రం 200 కోట్లకుపైగా వసూళ్లని రాబట్టింది. చెవిటి వ్యక్తిగా రామ్ చరణ్ అద్భుతమైన నటనతో అదరగొట్టాడు. చిత్రంలో రామ్ చరణ్.. గిన్నెలు తోమడం, టాయిలెట్ తీసే సీన్లు ఉన్నాయి. అయితే ఆ సీన్స్ రామ్ చరణ్ లాంటి స్టార్ హీరోచేత సుకుమార్ చేయించడంతో ఫ్యాన్స్ కాస్త అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలు ఆ సీన్స్ ఏదైన జిమ్మిక్కులు చేసి తీద్దామన్నా కూడా రామ్ చరణ్ తానే స్వయంగా చేస్తానని అన్నాడట. ఈ విషయం చిరంజీవికి తెలిశాక ఆయన రియాక్షన్‌కి వావ్ అనాల్సిందే. రోజూ ఇంట్లో గిన్నెలు తోమే అలవాటు ఉన్నట్టుగా రామ్ చరణ్ ఆ సీన్‌లో చేశాడని, చాలా అనుభవం ఉన్న వ్యక్తిలాగా, బాగా పాత్రలో ఇన్‌వాల్వ్ అయి చేశాడని, అందుకే అది అంత సహజంగా వచ్చిందని ఆ సన్నివేశం గురించి సుకుమార్ ఓ సందర్భంలో చెప్పుకొచ్చారు. చరణ్ అలా చేస్తుంటే మేము షాక్ అయ్యాం. చిరంజీవి ఈ సీన్ చూసి..ఈ సీన్ నువ్వే చేసి చూపించావ్ కదా చరణ్‌కి అని అడిగితే, లేదు సార్, నేను ఏం చెప్పలేదు. చరణ్ ఆ పాత్రని ఓన్ చేసుకొని నటించాడని సుకుమార్ అన్నాడట. చిరు అస్సలు నమ్మలేదు. అయితే రామ్ చరణ్ వంట చేసి రుచి చేసే సీన్ కూడా సహజంగా చేసాడని సుకుమార్ అన్నాడట. దానికి చిరు చాలా సర్‌ప్రైజ్ అయ్యాడట.





# రష్మికకు మద్దతుగా నిలిచిన కొడవ

కొడప హక్కుల పరిరక్షణ సంస్థ కొడప నేషనల్ కౌన్సిల్ నటి రష్మిక మందన్న భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కొనసాగుతున్న రాజకీయ వివాదాల మధ్య ఆమెకు భద్రత కల్పించాలని కేంద్ర, కర్ణాటక హోం మంత్రులను కోరింది. నటి రష్మిక మందన్న కర్ణాటకలోని కొడవ కమ్యూనిటీకి చెందినవారు. ఆమె బేస్ కొడగు ప్రాంతం. ఆమె కొడవ వారసత్వం కారణంగా నటిని అన్యాయంగా లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే రవి గనిగ నటిపై తీవ్ర విమర్శలు చేసిన నేపథ్యంలో ఈ అభ్యర్థన చేసింది. రష్మిక కృషి, ప్రతిభతో గొప్ప పేరు తెచ్చుకుంది. కొందరు భయబ్రాంతులకు గురి చేస్తున్నారని.. ఆమెను అనవసరమైన రాజకీయ చర్చల్లోకి లాగుతున్నారని అధ్యక్షుడు నందినేర్వండ నాచప్ప ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమెను మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు. ఆమె ఎదుగుదలకు.. రాజకీయాలతో సంబంధం లేదని.. ఆమెను రాజకీయ నాయకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కొందరు వ్యక్తులు, కళాత్మక స్వేచ్ఛ గురించి తెలియక, ఆమెను టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటకలోని మాండ్య నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే రవికుమార్ గనిగ.. రష్మిక కన్నడ చిత్ర పరిశ్రమను నిర్లక్ష్యం చేసి బెంగళూరు అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి హాజరు కావడానికి నిరాకరించారని ఆరోపిస్తున్నారు. ఆమె 2010లో కన్నడ చిత్రం కిరిక్ పార్టీలో ఇండస్ట్రీలోకి అరంగేట్రం చేసిందని.. కానీ ఇప్పుడు ఎన్ని ఆహ్వానాలు ఇస్తున్నా ఆమె కర్ణాటకను సందర్శించడానికి నిరాకరిస్తుందని చెబుతున్నారు. రష్మికను ఒక కార్యక్రమానికి ఆహ్వానిస్తే కర్నాటక ఎక్కడ ఉందని అడిగిందని, ఆమెకు సరైన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. రష్మికపై ఎమ్మెల్యే రవి విమర్శల నేపథ్యంతో వెంటనే భద్రత కల్పించాలని కోరారు నాచప్ప. రష్మిక ఇప్పటివరకు ఈ వివాదంపై ఎలాంటి స్పందన ఇవ్వలేదు. అయితే, సోషల్ మీడియాలో మాత్రం ఆమెకు మద్దతుగా అభిమానులు పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు.

# ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందిస్తాం

■ ఆడపడుచులకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ వరంలాంటిది ■ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్





**జన్నారం, మార్చి 11 (ప్రభాత సమాచారం)**
కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రతి పేదోడికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపడుతుందని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో 92 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ 5 మందికి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. పేదింటి ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మీ పథకం ఆర్థికంగా ఎంతో మేలును చేకుర్చుతుందని అన్నారు. ప్రతి ఆడపడుచుకు పెళ్లి అనంతరం 1లక్ష 16 రూపాయలను అందిస్తుందని పేర్కొన్నారు. సకాలంలో చెక్కులను బ్యాంకులో జమ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి ఎంపీడీవో ఉమర్ షరీఫ్ డిప్యూటీ తాసిల్దార్ రామ్మోహన్ రావు ఇతర అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

■ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకుల సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క

**ఆదిలాబాద్, మార్చి 11 (ప్రభాత సమాచారం)**
కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను గ్రామ స్థాయి లో విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి సీతక్క అన్నారు. హైద రాబాద్ లోని మంత్రి సీతక్క క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతీ నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పని చేయాలని, పార్టీ జెండా పట్టుకున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని ఆమె హామీ ఇచ్చారు. ఆజ్మీర శ్యాం నాయక్ మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలి పించేందుకు ఇప్పటి నుంచే వ్యూహాత్మకంగా ముందుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు దగ్గర చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశం ద్వారా జిల్లాలో కాంగ్రెస్ పటిష్టతపై కీలక చర్చలు జరగగా, ఎన్నికలకు ముందు పకడ్బందీగా కృషి చేయాలని నేతలు నిర్ణయించారు.



### టైగర్ జోన్ వైల్డ్ లైఫ్

## సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తా

తాగు సాగు నీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి
ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**కడెం, మార్చి 11 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలంలోని కవ్వాల్ టైగర్ జోన్ వైల్డ్ లైఫ్ సమస్యలను నేటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మాట్లాడారు. ఇక్కడి ప్రజలు వాహనదారులు టైగర్ జోన్ వైల్డ్ లైఫ్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో ఈ సమస్యలపై ముఖ్యమంత్రి అటవీ శాఖ మంత్రులకు విన్నవించడం జరిగిందన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కడెం ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉన్న రైతుల పంట పొలాలు ఎండిపోకుండా, సరైన సమయంలో నీటిని అందిస్తున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. చివరి ఆయకట్టు వరకు రైతుల పంటలు ఎండిపోకుండా నిరంత ఇస్తామన్నారు. నీటిని వృధా చేయకుండా రైతులు సక్రమంగా తమ పంటలకు వాడుకోవాల న్నారు. అలాగే ఎండలు తీవ్రమైతున్న తరుణంలో తాగునీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందన్నారు. అధికారులు అప్రమత్తమై తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల తాసి ల్దార్ రాజ మనోహర్ రెడ్డి ఎంపీడీవో ఉమర్ షరీఫ్ మండల పార్టీ అధ్యక్ష కార్యద ర్శులు జాఫర్ అలీ మేకల మాణిక్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ వైస్ చైర్మన్ ఫాసియుల్లా మాజీ ఎంపీపీ మాచ్చ శంకరయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం సతీష్, మాజీ ఎంపీటీసీ రియాజుద్దీన్ నందు నాయక్ దాముఖ కరుణాకర్, మామిడిపల్లి ఇందయ్య దూమల్ల రమేష్, షాకీర్ ఆలీ, జారుద్దీన్, బండారి స్వామి, ప్రశాంత్ సోహెల్గా మాజీ జెడ్పిటిసి పంకజ, ఈర్నాల గంగన్న, హనుమంతరావు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన డిఈ

రూ.50వేలు లంచం తీసుకుంటున్న పట్టుకున్న ఏసీబీ అధికారులు



**ఆదిలాబాద్, మార్చి 11 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్‌లో విద్యా మౌలిక వసతుల డీఈగా విధులు నిర్వహిస్తున్న శంకర్ ఏసీబీకి పట్టుబడ్డాడు. కాంట్రాక్టర్ నుంచి రెండు లక్షలు డిమాండ్ చేసిన శంకర్ రూ. 50వేలు తీసుకొంటుండగా ఏసీబీ అధికారులు మంగళవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ మైనారిటీ బాలికల కళాశాలకు రెండు కోట్లు మంజూరు కాగా.. ఆ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ దగ్గర డీఈ శంకర్ రూ. 2లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. రెండు లక్షలు లంచం డిమాండ్ చేసిన శంకర్ తో రూ. లక్ష కు ఒప్పందం కుదుర్చుకున్నారు కాంట్రాక్టర్. అందులో మొదటి విడతగా రూ. 50వేలు ఇస్తుండగా ఏసీబీఅధికారులు పట్టుకున్నారు. శంకర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు కరీంనగర్ కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరు కావలెను.
• ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి •
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

### బాడీ బిల్డింగ్‌లో బెల్లంపల్లి స్కై జిమ్‌కి

## బంగారు పతకాలు

**బెల్లంపల్లి, మార్చి 11 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా నస్పూర్ సీఈఆర్ క్లబ్‌లో ఉమ్మడి జిల్లా బాడీ బిల్డింగ్ పోటీ ల్లో బెల్లంపల్లి స్కైజిమ్ క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారని జిమ్ కోచ్ సదానందం తెలిపారు. నస్పూర్ ఎలిఫెంట్ జిమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతి విభాగంలో స్కై జిమ్ క్రీడాకారులకు బంగారు పతకాలు జక్కాయి. 80 కిలోల విభాగంలో లక్ష్మణ్‌కు బంగారు పతకం రాగా, కృష్ణ స్వామి మాస్టర్స్ విభాగంలో బంగారు పతకం, 50కిలోల విభాగంలో వెండి సయాణ సాధించారు. అక్షయ్ 70కిలోల విభాగంలో బంగారు, జూనియర్స్ విభాగంలో రెండో స్థానం. రాగా, రేవంత్ 55కిలోలు, జూనియర్స్ విభాగాల్లోనూ బంగారు పతకాలు సాధించాడు. వీరితో పాటు రవి55కిలోల విభాగంలో నాలుగో స్థానం, మహేష్, రోహిత్ హుమాయూన్ ఆయా పతకాలు సాధించారని తెలిపారు. విజేతలను బెల్లంపల్లి క్రీడాకారులు అభినందించారు.



## బాలరక్షా భవన్‌లో మహిళా దినోత్సం

**ఆసిఫాబాద్, మార్చి 11 (ప్రభాత సమాచారం)**
మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొమురంభీం జిల్లా ఆసిఫాబాద్ లోని బాలరక్ష భవఎన్‌లో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సావిత్రిని మంగళవారం జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేష్ సన్మానించారు. కార్యక్రమంలో బాల రక్ష భవన్ సిబ్బంది శ్రావణ్ కుమార్, శ్రీనివాస్, బాల ప్రవీణ్, చంద్ర శేఖర్, ప్రవీణ్ కుమార్, నసీర్‌ఉస్మాన్, ఝాన్సి పాల్గొన్నారు.

